సాక్షి
అనంతపురం
మంగళవారం ၊ 13 ၊ ఫిబ్రవరి ၊ 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.5°/15.7°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

అక్కచెల్లెమ్మల ఆనందం

- యజ్ఞంలా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు
- సెలవు రోజుల్లోనూ ఉద్యోగుల నిమగ్నం
- 12 రోజుల్లోనే 19,828 నమోదు
- స్థిరాస్తి పత్రాలు అందుకుని మురిసిపోతున్న మహిళలు



మహిళలతో కోలాహలంగా కనిపిస్తున్న ఈ సచివాలయం తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి గ్రామంలోనిది. పేదల సొంతింటి కల తీర్చడమే లక్ష్యంగా ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వం.. తాజాగా స్థలాలను మహిళ పేరుతో రిజిస్ట్రేషన్ చేసేందుకు శ్రీకారం చుట్టింది. దీంతో అక్కచెల్లెమ్మలు సచివాలయాలకు తరలివస్తున్నారు. సీఎం జగనన్న ఇల్లు మంజూరు చేసి, నిర్మిస్తుండడమే కాకుండా రిజిస్ట్రేషన్ ఉచితంగా చేయిస్తున్నారంటూ మురిసిపోతున్నారు.



సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందుకుంటున్న ఈమె పేరు ఈరమ్మ. గుంతకల్లు మండలం కసాపురం గ్రామం. సొంతిల్లు లేక ఎన్నో ఏళ్ల పాటు ఈరమ్మ అద్దె ఇంట్లో నివసించింది. పిల్లలు పెద్దవారై పెళ్లిళ్లు కూడా కావడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. టీడీపీ హయాంలో నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కానరాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ఆమె ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి దరఖాస్తు చేయించారు. కొన్ని రోజుల్లోనే గ్రామంలోని 270–5 సర్వే నంబర్‌లో ఇంటి స్థలం మంజూరైంది. ఈరమ్మ పేరుపై స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి సోమవారం పత్రాలు అందజేశారు. దీంతో ఆమె ఆనందం అంతా ఇంతా కాదు.

అనంతపురం అర్బన్: మహిళల అభ్యున్నతికి జగన్ సర్కారు పెద్దపీట వేస్తోంది. ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అండగా నిలుస్తోంది. స్థిరాస్తిని సమకూరుస్తూ జీవితాలకు భరోసా, భవిష్యత్తుకు ధీమా ఇస్తోంది. తమకంటూ సొంత స్థలం ఉండాలనే కోరిక తీరుస్తోంది. అక్కచెల్లెమ్మలకు ఇంటి స్థలం ఇవ్వడమే కాకుండా ఉచితంగా వారి పేరున రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కు కల్పిస్తోంది. దీంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లావ్యాప్తంగా స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైంది. 53,373 దరఖాస్తుల్లో ఇప్పటికే 19,828 రిజిస్ట్రేషన్లు చేశారు.

సెలవు రోజైనా విధుల్లోనే..

ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సచివాలయాల్లో జోరుగా సాగుతోంది. సెలవు రోజైన ఆదివారం కూడా ప్రక్రియను సచివాలయ సిబ్బంది చేపడుతున్నారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇప్పటికే 32.50 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. అలాగే, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో 51.10 శాతం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో 37.15 శాతం మేర ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేశారు.

జిల్లాలో ఇప్పటి వరకూ స్థలాల రిజిస్ట్రేషన్ ఇలా..

రెవెన్యూ డివిజన్	గ్రామాలు	దరఖాస్తులు	రిజిస్ట్రేషన్ చేసింది	చేయాల్సింది
అనంతపురం	127	25,571	8,311	17,260
కళ్యాణదుర్గం	95	10,812	5,525	5,287
గుంతకల్లు	101	16,990	5,992	10,998
మొత్తం	323	53,373	19,828	33,545

తోబుట్టువులా అండగా ఉన్నారు



ఒకే కడుపున పుట్టిన అన్నదమ్ములు కూడా నేడు సాయం చేయమంటే దూరమవుతున్నారు. కానీ, సీఎం జగనన్న ఓ తోబుట్టువులా మహిళలకు అండగా నిలుస్తున్నారు. కూలి పనికి పోతే గానీ కుటుంబ పోషణ సాధ్యం కాని నాకు ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు స్థల రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ప్రాణం ఉన్నంత వరకు జగనన్న వెంటే నడుస్తాం. –అమిదాల మీనా, రాప్తాడు

కుటుంబానికి పెద్ద దిక్కయ్యారు



కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ బాడుగ కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎం అయ్యాక రాప్తాడు సమీపంలో జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేశారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఈ సమయంలోనే సదరు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి సంపూర్ణ హక్కు కల్పించారు. ఎంతో ఆనందంగా ఉంది. –రామలక్ష్మి, రాప్తాడు.

ఫోన్ చేసి పిలిచి మరీ రిజిస్ట్రేషన్



కొడిమి ప్రాంతంలో నాకు ఇంటి స్థలం కేటాయించారు. ఇప్పుడు ఆ స్థలంపై సర్వ హక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఎక్కడైనా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఒకటికి రెండు సార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాలి. కానీ, నేడు నగరపాలక సంస్థ సచివాలయ సిబ్బంది ఫోన్ చేసి మరీ పిలిపించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇంతకన్నా ఏం కావాలి!.

– లలిత, వేణుగోపాల్ నగర్, అనంతపురం

జీవితాంతం రుణపడి ఉంటాం



మాకు సొంతిల్లు లేదు. నా భర్త టోపి వలి బేల్దారీ పని చేస్తాడు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరు చేయాలని అనేక మార్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగాం. ఎవరూ కనికరించలేదు. జగనన్న ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న కొన్ని రోజులకే స్థలం మంజూరు చేసి ఇంటిని కట్టించారు. ఇప్పుడు సచివాలయం ద్వారా ఉచితంగా ఇంటిస్థలం రిజిస్ట్రేషన్ చేయించారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–షేక్ షర్మాస్ బీ, బుక్కరాయసముద్రం

వేగంగా ప్రక్రియ



స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా జరుగుతోంది. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 323 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ కోసం 53,373 దరఖాస్తులు వచ్చాయి. 12 రోజుల్లోనే 19,828 రిజిస్ట్రేషన్లు జరిగాయి. సెలవు రోజుల్లోనూ ప్రక్రియను సచివాలయ సిబ్బంది చేపడుతున్నారు.

– కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

న్యూస్‌రీల్

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల



అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో ఎస్జీటీ పోస్టులు 107, స్కూల్ అసిస్టెంట్లు 164, టీజీటీ పోస్టులు 115 భర్తీ కానున్నాయి. 2018 సిలబస్ మేరకే టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ) జరగనుంది. సోమవారం నుంచి ఈనెల 21 వరకూ ఫీజు చెల్లింపునకు గడువు విధించారు. 22 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. మార్చి 5 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మార్చి 15 నుంచి 30 వరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. రోజూ రెండు విడతలుగా పరీక్షలు ఉంటాయి. ఉదయం 9.30 నుంచి 12 వరకు మొదటి విడత, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల రెండో విడత ఉంటుంది. మార్చి 31న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. ఏప్రిల్ 1న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 2న ఫైనల్ కీ విడుదల, ఏప్రిల్ 7న డీఎస్సీ ఫలితాలు విడుదల చేయనున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు వయోపరిమితి 44 ఏళ్లు కాగా, రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు మరో 5 ఏళ్లు అంటే 54 ఏళ్ల వయోపరి మితి పెంచారు. ఉపాధ్యాయ పోస్టుల ఎంపిక కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా డీఈఓ వ్యవహరించనున్నారు. నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు https://apdsc.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచారు.

వైఎస్సార్‌టీఎఫ్ హర్షం

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాల సేకరణ కేంద్రాలకు లైసెన్సు తప్పనిసరి

అనంతపురం అగ్రికల్చర్: పాల సేకరణ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రమణ్యం, అనంతపురం డివిజన్ డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 చెల్లించి లైసెన్సు తీసుకోవడంతో పాటు మిషన్ క్యాలిబ్రేషన్ కోసం రూ.500 చెల్లించాలన్నారు. ఆర్బీకే సిబ్బంది లేదా పశు వైద్యశాలల్లో లైసెన్సులు పొందాలన్నారు.


అప్పు కట్టనందుకు హతమార్చారు



జిలాన్ బాషా మృతదేహం

అనంతపురం: స్నేహితులే అతడి పాలిట కాలయములయ్యారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జరిగిన గొడవలో హతమార్చారు. అనంతపురం నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. అనంతపురం వన్ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. నగరంలోని వినాయక నగర్‌కు చెందిన జిలాన్ బాషా అలియాస్ కుక్కల జిలాన్ (35), ప్రసాద్, నవీన్, కుళ్లాయప్ప, ప్రతాప్ స్నేహితులు. సోమవారం ఉదయం వీరంతా కలిసి గుత్తి రోడ్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక వైపు నిర్జన ప్రదేశంలో పూటుగా మద్యం సేవించారు. అప్పుగా తామిచ్చిన డబ్బు కట్టాలని జిలాన్‌ను స్నేహితులు నిలదీశారు. ఈ క్రమంలో గొడవ చోటుచేసుకుంది. మాటమాట పెరిగి జిలాన్ తలపై బండరాయితో మోదారు. అక్కడి నుంచి పరారయ్యారు. తీవ్రగాయాలైన జిలాన్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. నిందితులు నలుగురితో పాటు నవీన్ చెల్లెలు సువర్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. జిలాన్‌పై దాడిని సువర్ణ ప్రోత్సహించినట్లు విచారణలో తేలిందని ఆయన చెప్పారు. జిలాన్ తల్లిదండ్రులు మరణించారని, పెళ్లి కాలేదన్నారు. సువర్ణను అదుపులోకి తీసుకున్నామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

బాధ్యతలు స్వీకరించిన అడిషనల్ ఎస్పీ



ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఏఎస్పీ లక్ష్మీనారాయణ రెడ్డి

అనంతపురం: అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్.లక్ష్మీ నారాయణ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. లక్ష్మీనారాయణరెడ్డి అనంతపురం, చిత్తూరు, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో పలు హోదాల్లో పనిచేశారు. ఆయనకు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరి నాథ్, తేజ్‌పాల్, మసూద్, రాష్ట్ర సభ్యులు జాఫర్ తదితరులు అభినందనలు తెలిపారు.

జేసీ సోదరులది ఆటవిక సంస్కృతి

- కోర్టుల ద్వారా అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం
- తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: అధికారంలో ఉన్నన్నాళ్లూ దోపిడీ, దౌర్జన్యాలతో రెచ్చిపోయిన జేసీ సోదరులు ఇంకా ఆటవిక సంస్కృతిని కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో సోమవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కోర్టుల్లో కేసు పత్రాలను దొంగిలించిన ఘనత జేసీ సోదరులకే దక్కిందన్నారు. కప్పం కట్టలేదంటూ టీడీపీ హయాంలో పరిశ్రమలకు తాళాలు వేసి వారు చేసిన దౌర్జన్యాన్ని ఇంకా ప్రజలు మరువలేదన్నారు. అనాగరిక చేష్టలతో తాడిపత్రి నియోజకవర్గాన్ని ఆటవిక రాజ్యంగా మార్చారన్నారు. నేడు తాము అభివృద్ధి బాటలో నడిపిస్తుంటే ఓర్వలేక కోర్టులెక్కి అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. తాడిపత్రి పట్టణంలోని ఆంజనేయస్వామి మాన్యంలో 40 ఏళ్లుగా పేదలు ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారని, వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో తాము దేవదాయశాఖకు మరో చోట స్థలం చూపిస్తామంటే జేసీ ప్రభాకర్‌రెడ్డి కోర్టు నుంచి స్టే తీసుకొచ్చాడన్నారు. ఆర్టీఓ కార్యాలయం, ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను సొంత నిధులతో నిర్మిస్తున్నా అడ్డుపడ్డాడని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో అభివృద్ధి పనులు చేయకుండా గాడిదలు కాశారా అంటూ ధ్వజమెత్తారు. ప్రజలు వారికి మళ్లీ బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎవరికీ భయపడకుండా మంచి నాయకులను ఎన్నుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, జెడ్పీటీసీ రమణమ్మ, ఆలూరు రామేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సిద్ధం

- 18న రాప్తాడుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాక



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా

రాప్తాడు: మండలంలోని ఆటోనగర్ వద్ద 'సిద్ధం' సభకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 18న నిర్వహించనున్న సభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివా రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా విభాగాల ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. వైఎస్సార్ సీపీలోని అన్ని విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెల, మేకల సహకార సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

- జిల్లాలో కొత్తగా 23 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు
- కలెక్టర్ గౌతమి

రాయదుర్గం/గుమ్మఘట్ట: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. సోమవారం రాయదుర్గంలో ఆమె పర్యటించారు. ఈవీఎంల పంపిణీ కోసం ఎంపిక చేసిన మార్కెట్ యార్డును పరిశీలించారు. బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. పరీక్షల్లో వంద శాతం ఫలితాలు రాబట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, చదువే తమను ఈ స్థాయికి చేర్చిందంటూ విద్యార్థులకు హితవు పలికారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించామన్నారు. ఓటర్లకు ఇబ్బంది తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, వెలుతురు, ర్యాంప్‌లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 1,500 ఓట్లు దాటిన ప్రతి చోటా పోలింగ్ స్టేషన్లను విభజిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటికే 23 కొత్త పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. అవసరమైతే మరిన్ని పెంచుతామన్నారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌ను సెక్టోరియల్ సిబ్బంది తనిఖీ చేసి నివేదికలు అందించినట్లు తెలిపారు. త్వరలో ఆర్ఓ, ఏఆర్ఓలు కూడా తనిఖీ చేస్తారన్నారు. ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడి స్ట్రాంగ్‌రూమ్‌లో ఈవీఎంలు భద్రపరుస్తామని కలెక్టర్ చెప్పారు.



రాయదుర్గంలో ఈవీఎంల పంపిణీ కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

8 ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

రాయదుర్గం మండలంలో జుంజురంపల్లి సమీపంలోని ఇసుక రీచ్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల అవసరాల మేరకు జిల్లాలో మరో 8 కొత్త రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనంతరం గుమ్మఘట్ట మండలంలోని 75 వీరాపురం, గుమ్మఘట్ట పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ సూర్యప్రతాప్, తహసీల్దార్ చిట్టిబాబు, ఈడీటీ సుజాత, రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అమృత్' అందగా.. సొబగులు దిద్దగా



భవనాలను నేలమట్టం చేయడంతో బోసిపోయి కనిపిస్తున్న అనంతపురం రైల్వే స్టేషన్

అనంతపురం రైల్వే స్టేషన్ కొత్త రూపు దిద్దుకుంటోంది. త్వరలో అధునాతన సొబగులు అద్దుకుని అందుబాటులోకి రానుంది. 'అమృత్ భారత్' పథకంలో భాగంగా రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని సంకల్పించారు. రూ.7 కోట్లతో పనులు చేపడుతున్నారు. పెరిగిన ప్రయాణికులు, రైళ్ల రద్దీ కనుగుణంగా సౌకర్యాలు సమకూరనున్నాయి. ఈ క్రమంలోనే పాత భవనాలను తొలగించే కార్యక్రమానికి సోమవారం దక్షిణ మధ్య రైల్వే విభాగం శ్రీకారం చుట్టింది.

– అనంతపురం సిటీ

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 140 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 140 వినతులు అందాయి. అర్జీదారులతో ఎస్పీ అన్బురాజన్ స్వయంగా మాట్లాడి, సమస్య తీవ్రత అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా పోలీసు స్పందన విభాగం 93929 26803కు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను www.cybercrime. gov.in వెబ్‌సైట్ లేదా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆంథోనప్ప, ఎస్బీ సీఐ ఇందిర పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ ఆత్మహత్య


లక్ష్మీనారాయణ (ఫైల్)

ఉరవకొండ: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఆర్‌ఎంపీ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న దండా లక్ష్మీనారాయణ (48) ఆర్‌ఎంపీగా జీవనం సాగిస్తున్నారు. భార్య కుళ్లాయమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆయన సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఇంటికి చేరుకుని, లక్ష్మీనారాయణను 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

శెట్టూరు: మండలంలోని ఎర్రబోరేపల్లికి చెందిన వడ్డే హనుమంతరాయుడు (58) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు హనుమంతరాయుడు భార్య అక్కమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నాడు. భార్యకు జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఆయన సోమవారం తన తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంత సేపటికీ ఆయన ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబసభ్యులు తోటకెళ్లి పరిశీలించారు. అప్పటికే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న హనుమంతరాయుడిని గమనించి బోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాంభూపాల్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

నేత్రపర్వం... బాలోత్సవం


భరతమాత వేషధారణలో చిన్నారి

- ఆటపాటలతో సందడి చేసిన చిన్నారులు
- చదువుతో పాటూ కళలనూ ప్రోత్సహించాలన్న వక్తలు


ప్రసంగిస్తున్న బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా


శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

అనంతపురం కల్చరల్: చిన్నారుల సృజనకు అద్దం పడుతూ మూడురోజుల పాటు సందడిగా సాగనున్న బాలోత్సవం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందోత్సాహాలతో చిన్నారులు సందడి చేశారు. తొలిరోజు బాలల పండుగను చిన్నారులతో కలసి బాలోత్సవ్ కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీవుల్లా, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, కర్రసాము, జానపద, శాస్త్రీయ నృత్యాలు, సైన్సు ఎగ్జిబిషన్, శాస్త్రీయ సంగీతం, బొమ్మలు చేయడం వంటి పోటీలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సృజనను చాటుకున్నారు. ముఖ్యంగా చిన్నారుల వేషధారణలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి.

బాలల మనోవికాసం అవసరం

ఆటపాటలతో సాగాల్సిన బాల్యాన్ని చిదిమేస్తున్నారని, మార్కులు, ర్యాంకుల గోల వారి స్వేచ్ఛను హరించరాదని తల్లిదండ్రులకు బాలోత్సవ కమిటీ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, ముఖ్యఅతిథులు సూచించారు. జెండావిష్కరణ అనంతరం భారతరత్న స్వామినాథన్ పేరుతో ఏర్పాటు చేసిన వేదికపై జరిగిన సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, బాలోత్సవ్ రాష్ట్ర నాయకులు రామరాజు, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, పట్నం శివప్రసాద్, జిలాన్‌బాషా, నబీరసూల్, ఎల్కేపీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, గాజుల పద్మజ, డాక్టర్ ప్రసూన, డాక్టర్ గేయానంద్, యోగా గురువు కటకం కృష్ణవేణి, బాలోత్సవ్ ప్రతినిధులు ఐద్వా సావిత్రి, శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. భాష పట్ల మమకారం, కళల పట్ల అనురక్తి, క్రీడలు, వైజ్ఞానిక విషయాల పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా బాలోత్సవాన్ని నిర్వహిస్తుండడం ఆనందదాయకమన్నారు. సెల్‌ఫోన్లకు, కంప్యూటర్లకు పరిమితం అయిపోతున్న చిన్నారులు అందులో మంచిని గ్రహించి భవితను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సాయంత్రం సమావేశంలో పలువురు సాహితీవేత్తలు, అధికారులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి, వివిధ రంగాల్లో ప్రతిభ చాటుకున్న చిన్నారులకు జ్ఞాపికలనందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కత్తి విజయ్ కుమార్, సాధుశేఖర్, ఎల్‌ఆర్ వెంకటరమణ, రియాజుద్దీన్, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, మధురశ్రీ తదితరులు వ్యవహరించారు.


జాతీయ సమైక్యత గీతానికి డ్యాన్స్ చేస్తున్న బాలికలు


జానపద నృత్యంలో బాలికలు


సినీ నేపథ్య గీతానికి నృత్యం చేస్తున్న బాలురు

ఈ ఎన్నికలే బాబుకు ఆఖరు

- ఓటమి భయంతో పొత్తులకు పాకులాట
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శంకరనారాయణ, విశ్వ, పార్టీ అధ్యక్షుడు పైలా ధ్వజం


మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి (చిత్రంలో) శంకరనారాయణ, పైలా నరసింహయ్య

కూడేరు: నమ్మిన వారికి వెన్నుపోటు పొడిచే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు రాబోవు ఎన్నికలే చివరివి కానున్నాయని అనంతపురం పార్లమెంట్, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్తలు ఎం.శంకరనారాయణ, వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య ధ్వజమెత్తారు. ఎన్నికల తర్వాత టీడీపీ పూర్తిగా కనుమరుగు కానుందని స్పష్టం చేశారు. సోమవారం కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లిలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కలసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబుకి ఓటమి భయం పట్టుకుందన్నారు. అత్యంత జనాదరణ కలిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదర్కొనే దమ్ము లేక బీజేపీతో పొత్తుకు పాకులాడుతున్నారన్నారు. ప్యాకేజీల కోసం ఆశపడి చంద్రబాబు కాళ్ల వద్ద జనసేన పార్టీని తాకట్టు పెట్టిన ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఓ రాజకీయ అజ్ఞానిగా మారాడన్నారు. బాబు మాదిరే పొత్తుల పేరుతో తనను నమ్ముకున్న పార్టీ నేతలకు పవన్‌కళ్యాణ్ కూడా వెన్నుపోటు పొడుస్తున్నాడని మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఓ వలస పక్షి అని, ఎన్నికల వేళ మాత్రమే ప్రజల వద్దకు ఆయన వచ్చి వెళతాడని ఎద్దేవా చేశారు. వెన్నుపోటుదారులు, వలస పక్షులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే అన్ని వర్గాల వారికీ లబ్ధి చేకూరిందన్నారు. ఈ నేపథ్యంలో బాబు ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా.. చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ రెండో సారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అశ్విని, పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో డిసెంబర్‌లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం ఒకటి, రెండో సెమిస్టర్ (ఆర్–15), (ఆర్–19) సప్లిమెంటరీ, రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20) సప్లిమెంటరీ, రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–15 లాస్ట్‌ఛాన్స్), రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15 లాస్ట్ ఛాన్స్) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

తిరిగింపులకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- అగళి సమీపంలో బొలెరోను ఢీకొన్న సిమెంట్ లారీ
- ముగ్గురి దుర్మరణం, 18 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం
- శోకసంద్రంలో దాసప్పపాళ్యం


అమ్మాజమ్మ, కాంతరాజు, గోవిందప్ప(ఫైల్)

అగళి/రొళ్ల/మడకశిర: పెళ్లి తిరిగింపులకు వెళ్లిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. అంత వరకూ పెళ్లి ముచ్చట్లు చెప్పుకుంటూ సంతోషంగా గడిపిన వారు బంధువుల కళ్లముందే కన్ను మూశారు. అగళి సమీపంలో పెళ్లి బృందంతో వెళ్తున్న బొలెరోను సిమెంట్ లారీ ఢీ కొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో 18 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే..రొళ్ల మండలం దాసప్పపాళ్యం చెందిన మంజునాథ్‌కు కర్ణాటక ప్రాంతం శిర తాలూకా హుచ్చగిరేనహళ్లి చెందిన తేజశ్వినికి శిర సమీపాన మరడిగుడ్డ రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం వివాహం జరిగింది. సాయంత్రం దాసప్పపాళ్యం గ్రామం నుంచి అమ్మాజమ్మ(33), కాంతరాజు(39), గోవిందప్ప(72)తో పాటు మరో 20 మందికి బొలెరో వాహనంలో హుచ్చగిరేనహళ్లి గ్రామంలోని వధువు ఇంట్లో జరిగిన పెళ్లి తిరిగింపు వేడుకలకు వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగిశాక రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. వీరి వాహనం ఆదివారం అర్ధరాత్రి అగళి మండలం ఇరిగేపల్లి గ్రామం వద్దకు రాగానే మలుపు వద్ద శిర వైపు వెళ్తున్న సిమెంట్ లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో అమ్మాజమ్మ, కాంతరాజు, గోవిందప్ప అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఈరక్యాతరాయప్ప, నాగన్న పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరు నిమాన్స్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గౌరమ్మ, రాఖీ, నరసింహమూర్తి, రాధమ్మ, కమలమ్మ, అక్కమ్మ, సుమక్క, జగన్నాథ్, అనిల్ మరికొందరిని హిందూపురం, తుమకూరు, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న అగళి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను మడకశిర ఆస్పత్రికి తరలించారు. అమ్మాజమ్మ భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మనోహర్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ బాజీ జాన్ సైదా పరిశీలించారు.

శోకసంద్రమైన దాసప్పపాళ్యం..

పోస్టుమార్టం అనంతరం అమ్మాజమ్మ, కాంతరాజు, గోవిందప్ప మృతదేహాలను స్వగ్రామం దాసప్పపాళ్యానికి తరలించారు. అప్పటికే గ్రామానికి చేరుకున్న మృతుల బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు నిర్జీవంగా వచ్చిన తమవారిని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. కాంతరాజు భార్య లావణ్యతో పాటు పిల్లలు చేతు, యత్విక్‌గౌడ, అమ్మాజమ్మ భర్త శ్రీనివాస్ రోదన చూసి అక్కడున్న వారంతా కంటతడిపెట్టారు. అనంతరం సాయంత్రమే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

రోడ్డు ప్రమాదం మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. మడకశిర ఆస్పత్రిలో అమ్మాజమ్మ, కాంతరాజు, గోవిందప్ప మృతదేహాలకు ఆయన నివాళులర్పించారు. ఆస్పత్రి వద్ద ఉన్న మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. మరోవైపు రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, నాయకులు దాసప్పపాళ్యం గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను ఓదార్చి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

బీజేపీ నేత పుండరీకాక్షరెడ్డి మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో) పుండరీకాక్షరెడ్డి (ఫైల్)

అనంతపురం టవర్‌క్లాక్: బీజేపీ సీనియర్ నేత పుండరీకాక్షరెడ్డి (81) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న పుండరీకాక్షరెడ్డి స్వగృహంలో ఆయన మృతదేహానికి ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. యాడికి మండలం కేశవనాయుడుపేటలో జన్మించిన పుండరీకాక్షరెడ్డి 1972లో అనంతపురం పట్టణ జన సంఘ్ కార్యదర్శిగా పనిచేశారు. 1976లో దేశంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు 21 రోజుల పాటు జైలు శిక్ష అనుభవించారు. 1981, 88లో బీజేపీ తరపున ఎర్రనేలకొట్టాల కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 1976 నుంచి 2006 వరకూ జిల్లాలో బీజేపీ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆయన మృతి బీజేపీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుద్దుకుంట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు ఆత్మారామిరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, న్యాయవాది విఠల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు రామచంద్రయ్య, గోవర్ధన్, రత్నమయ్య, ఫయాజ్, చలపతి, సుబ్రహ్మణ్యం, శ్రీధర్, శ్రీనివాసులు తదితరులు పుండరీకాక్షరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కృత్రిమ మేథ, డేటా సైన్స్‌పై సదస్సు


సైబర్ సెక్యూరిటీ నిపుణుడు అనంతప్రభును సన్మానిస్తున్న ప్రొఫెసర్ జి.రామిరెడ్డి

అనంతపురం: కృత్రిమ మేథ– డేటా సైన్స్ అంశంపై సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌ఏ కోరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సైబర్ సవాళ్లపై చర్చించారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయన్నారు. ప్రొఫెసర్ జి.రామిరెడ్డి అధ్యక్షతన ఈ సదస్సులో పలు అంశాలపై విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ లా ట్రైనర్, మంగళూరుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ జి.అనంతప్రభు అవగాహన కల్పించారు.

కలెక్టర్ బంగ్లాలో నగలు చోరీ

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు నివాసగృహంలో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరి రామయ్య తెలిపిన వివరాల మేరకు... కలెక్టర్ అరుణ్ బాబు శనివారం సెలవుపై తన కుటుంబ సభ్యులను కలవడానికి వెళ్లి.. సోమవారం తిరిగి పుట్టపర్తికి విచ్చేశారు. వారం క్రితం తన ప్రత్యేక గదిలో ఉంచిన కొన్ని ఆభరణాలు కన్పించలేదు. ఇల్లు మొత్తం వెతికినా వాటి జాడ లేకపోవడంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి.. విచారణ చేపట్టాలని ఆదేశించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాల కోసం అన్వేషించారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో జిల్లా కలెక్టర్ బంగ్లా ఉంది. అక్కడ 15 మంది వరకు సెక్యూరిటీ సిబ్బంది, వ్యక్తిగత సహాయకులు, అధికారులు ఉంటారు. అత్యంత భద్రత కలిగిన కలెక్టర్ బంగ్లాలోకి బయటి వ్యక్తులు ప్రవేశించేందుకు అవకాశం లేదనే అభిప్రాయానికి పోలీసులు వచ్చారు. నిందితులను త్వరలోనే గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

ఏపీజీబీ సేవలు వినియోగించుకోండి

అనంతపురం అగ్రికల్చర్: ప్రైవేట్, వాణిజ్య బ్యాంకులకు దీటుగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అందిస్తున్న డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులకు చైర్మన్ రాకేష్ కశ్యప్ పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురంలోని రామచంద్రనగర్ శాఖకు చెందిన కొత్త భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇటీవల రిక్రూట్‌మెంట్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, సమగ్రత పాటించాలని సూచించారు. రైతులు, ఖాతాదారులకు సేవలందిస్తూనే బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్‌ఎం శ్రీదేవి, శిక్షణ డైరెక్టర్ శర్మ, చీఫ్ మేనేజర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు


అర్జీలు స్వీకరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: 'స్పందన'లో అందే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని జేసీ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్‌తోపాటు జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డిప్యూటీ కలెక్టర్లు రవీంద్ర, నీలమయ్య, వరప్రసాద్, ఆనంద్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 289 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో జేసీ సమీక్షించారు. అర్జీదారులకు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలన్నారు. ప్రతి అర్జీకి ఎండార్స్‌మెంట్ ఇచ్చి సంతకం తీసుకోవాలన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేయనున్న జేఎన్‌టీయూ కళాశాలను జేసీ సోమవారం సందర్శించారు. చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిచ్చారు. ఎన్నికల సమయానికి భవనాల్లో బ్యారికేడ్లు, సీటింగ్, ఫెన్సింగ్, ఫర్నీచర్, లైటింగ్, మైక్ సిస్టం తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. చిన్న పొరపాటుకూ తావివ్వకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ఈఆర్‌ఓ జె.శిరీష్, తహసిల్దారు శివరామిరెడ్డి, సర్వేయర్ ప్రతాపరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 242 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో కొనసాగుతున్నాయి. సోమవారం మొత్తం 55 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 242 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 8,003 మంది జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు గాను 7,761 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 4,522 మందికి గాను 4,346 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 3,481 మందికి 3,415 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణనాయక్ 6 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 కేంద్రాలు పరిశీలించారు.

హంద్రీ-నీవాలో యువకుడి మృతి


రిజర్వాయర్‌లో తేలిన మస్తావలి మృతదేహం

బెళుగుప్ప: హంద్రీ–నీవా కాలువలో గల్లంతైన యువకుడు మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సోమవారం జీడిపల్లి రిజర్వాయర్‌లో గుర్తించారు. వివరాలు... గుంతకల్లుకు చెందిన భాను, రజాక్ దంతపులు హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్నారు. వీరి కుమారుడు మస్తాన్ వలి (19) డ్యాన్సర్. ఇటీవల కొన్ని చిత్రాల్లో సైడ్ యాక్టర్‌గా నటించాడు. శనివారం తన అక్క హసీనాతో కలసి ఉరవకొండ మండలం కౌకుంట్లలోని అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఆ గ్రామ శివారులో ఈతకు వెళ్లిన మస్తాన్‌వలి నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు కాలువ వెంబడి గాలించినా ప్రయోజనం లేకపోయింది. సోమవారం ఉదయం బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో మస్తాన్‌వలి మృతదేహం గుర్తించి వెలికి తీసి ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఉరవకొండ పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు బెళుగుప్ప ఎస్‌ఐ శివ తెలిపారు.

టీడీపీ పిట్ట కథలు నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



ఆసరా సభకు హాజరైన మహిళలు

- పరిటాల సునీత పది మందికి కూడా ఇళ్ల పట్టాలు ఇవ్వలేదు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజం
- చిన్మయనగర్‌లో ఆసరా సంబరాలు

రాప్తాడు: 'పరిటాల సునీత ఐదేళ్లు మంత్రిగా ఉండి కూడా పట్టుమని పది మందికి ఇంటి పట్టాలు పంపిణీ చేయలేదు. ఇళ్లు మంజూరు చేయించలేదు. అలాంటి వాళ్లు ఎన్నికల సమయంలో మళ్లీ ప్రజల వద్దకు వస్తారు. పాత హామీలు గాలికోదేలేసి, కొత్త హామీలతో మీ ముందుకు వస్తారు. మళ్లీ కొత్త కథలు, పిట్ట కథలు చెబుతారు. అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలి' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. పంచాయతీలో 110 స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద మంజూరైన రూ.1.25 కోట్ల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు పంపిణీ చేశారు. ముందుగా లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు 2014 ఎన్నికల ముందు ప్రచారంలో తనను గెలిపిస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి పొదుపు మహిళలను మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మహిళా సంఘాల సభ్యులు డిఫాల్టర్లుగా మిగిలిపోయారన్నారు. బంగారు రుణాలు, రైతు రుణాలు, ఇంటింటికీ నిరుద్యోగ భృతి, రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం ఇలా హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని మోసం చేశారని మండిపడ్డారు. పరిటాల సునీత కూడా మీరు రుణాలు కట్టవద్దని చెప్పిందని, గెలిచిన నాలుగు సంవత్సరాల తర్వాత అసెంబ్లీలో డ్వాక్రా రుణాలు మాఫీ చేసేదే లేదని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి డ్వాక్రా సంఘాల రుణాలు రూ.11,060 కోట్లు ఉండేవన్నారు. ఆయన 2019లో అధికారంలో నుంచి దిగిపోయే నాటికి ఈ అప్పులు రూ.25,500 కోట్లకు చేరాయన్నారు.

ప్రసన్నాయపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ప్రసన్నాయపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీలో దాదాపు 350 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఇంకా 230 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ రోజు రాప్తాడు నుంచి చిన్మయనగర్ మెయిన్ రోడ్డును పూర్తి చేశామన్నారు. త్వరలోనే పండమేరు వంకలో బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీకి రూ.80 లక్షల గ్రాంటు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పంచాయతీలో ప్రతి కాలనీలో మట్టి రోడ్లు కన్పించకుండా రూ.2 కోట్లతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల సంఘం జిల్లా చైర్మన్ పసుపుల నరసింహా గౌడ్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, ఈఓఆర్డీ నరసింహా రెడ్డి, ఏపీఎం నల్లప్ప, సీసీ శ్రీరాములు, ఉమాదేవి, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, డీలర్ సాంబ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, మనోహర్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి మీరే సాక్ష్యం



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- జగన్ సీఎంగా ఉంటేనే పేదలకు మేలు
- వైఎస్సార్‌సీపీకి అండగా నిలవండి
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 41వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'

అనంతపురం కార్పొరేషన్: ''సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అనంతపురం నియోజకవర్గంలో ఊహకందని సంక్షేమం, అభివృద్ధి జరిగింది. ఇందుకు మీరే నిలువెత్తు సాక్ష్యం. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి'' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరంలోని 41వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం జరిగింది. గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని 50 డివిజన్లు, అనంతపురం రూరల్, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, ఏ నారాయణపురం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశామన్నారు. రూ.వెయ్యి కోట్లకు పైగా అభివృద్ధి జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక సంక్షేమం విషయానికొస్తే అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అమ్మఒడి, చేయూత, చేదోడు, పేదలందరికీ ఇళ్లు, తదితర పథకాలను అందించడంతో ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం పడలేదన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను బలోపేతం చేయడం జరిగిందని వెల్లడించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రూ.3 కోట్లతో అభివృద్ధి

41వ డివిజన్‌లో రూ.3 కోట్లతో రోడ్లు, కాలువలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఈ విధంగా అభివృద్ధి జరిగిందా అని ప్రజలను ప్రశ్నించగా.. ఎన్నడూ ఈ స్థాయిలో అభివృద్ధి జరగలేదని ప్రజలు ఎమ్మెల్యేకు బదులిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు గోగుల లక్ష్మీదేవి, దుర్గాదేవి, జయలలిత, సుమతి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, ఇసాక్, కమల్‌భూషణ్, స్థానిక నాయకులు గోగుల రాధాకృష్ణ, విజయ్‌కుమార్, సుహాసిని, నాగార్జున, పవన్, శ్రీనాథ్, వీరాంజి, రాజు, మహబూబ్‌బాషా, అనుబంధ సంఘాల అధ్యక్షులు కొర్రపాడు హుస్సేన్ పీరా, సైఫుల్లాబేగ్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మిద్దె నగేష్, చింతకుంట మధు, విజయ సతీష్, గుజ్జల లక్ష్మణ్, చిదంబర్ రెడ్డి, జావెద్, భారతి, షమీం, తదితరులు పాల్గొన్నారు.

నేడు 42వ డివిజన్‌లో..

నగరంలోని 42వ డివిజన్‌లోని 6వ రోడ్డులో మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

57 నెలల్లో రూ. 1,045 కోట్ల అభివృద్ధి



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి ఈసారి టీడీపీ టికెట్ రాదనే ప్రచారం నడుస్తుండటంతో తన ఉనికిని చాటుకునేందుకు ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఎవరెన్ని విమర్శలు, గిమ్మిక్కులు చేసినా మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని మేయర్ వసీం పేర్కొన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. సోమవారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులు, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నియోజకవర్గంలో 57 నెలల్లో రూ.1,045 కోట్ల అభివృద్ధి జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. మురికివాడలపై మున్నానగర్, అంబేడ్కర్ నగర్, బిందెల కాలనీలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ గ్రూపు రాజకీయాలు నిజం కాదా అని ప్రశ్నించారు. అభివృద్ధిని కేవలం డివైడర్లకు మాత్రమే పరిమితం చేసి కాలం గడిపారన్నారు. టీడీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అభివృద్ధి చేసినందుకే తాము ధైర్యంగా ముందుకెళ్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పార్టీకతీతంగా సంక్షేమాన్ని అందివ్వడం జరిగిందన్నారు. కోవిడ్‌తో రెండేళ్లు గడిచి పోయినా ఎక్కడా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సైఫుల్లా బేగ్, ఇసాక్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి లిఖితకు డీసీసీబీ ఉద్యోగుల అండ



చెక్కు అందజేస్తున్న డీసీసీబీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

అనంతపురం అగ్రికల్చర్: గుండెజబ్బుతో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్సల నిమిత్తం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉద్యోగుల యూనియన్ తరఫున ఆర్థిక సాయం అందజేశారు. ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన చిన్నారి లిఖిత గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న అసోసియేషన్ నాయకులు తమ వంతు సాయం అందించారు. యూనియన్‌కు చెందిన ఉద్యోగులు రూ.36 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం స్థానిక డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

విజయ్‌సాయికి విశ్వగురు పురస్కారం



హైకోర్టు జడ్జి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విజయ్‌సాయి

అనంతపురం కల్చరల్: విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకుడు సత్యవోలు రాంబాబు నేతృత్వంలో తెలుగు రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న వారికి సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ టూరిజం ప్లాజా ప్రాంగణంలో జాతీయ పురస్కారాలు అందజేశారు. హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్, జిల్లా జడ్జి మదన్‌మోహన్ చేతుల మీదుగా జిల్లాకు చెందిన సామాజిక సేవా కార్యకర్త విజయ్‌సాయి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. నాలుగేళ్లుగా వందలాది వృద్ధ జంటలకు ఉచితంగా షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊపందుకున్న ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. సోమవారం జెడ్పీటీసీ మారుతిప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, హౌసింగ్ అధికారులతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక తహసీల్దార్ కార్యాలయ పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన ఈ కాలనీలో తొలి విడతగా 55 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సహకారంతో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 35 పైగా ఇళ్లకు టాప్‌లు వేసి ప్లాస్టింగ్ పనులు చేయిస్తున్నామన్నారు. త్వరలోనే ఇళ్ల నిర్మాణాలన్ని పూర్తి చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ అంకె అశోక్, నాయకులు వలగొండ భాస్కర్, సుధాకర్‌రెడ్డి, సోమయ్య, రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనంతపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. అనంతపురం త్రీ టౌన్ సీఐ ధరణి కిశోర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కళాకారుల కాలనీలో నివాసం ఉంటున్న డుంగావత్ డేవిడ్ నాయక్ (21) ఈ నెల 10వ తేదీన తన స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలు ముగించుకుని గార్లదిన్నె వైపు వెళ్తున్నాడు. గుత్తి రోడ్డు కెనాల్ బ్రిడ్జ్‌పైన బైక్ మీద నుంచి కిందకు పడటంతో ముఖానికి గాయాలయ్యాయి. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. డేవిడ్ నాయక్ తండ్రి చాంప్లానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చరిత్రలో నిలిచేలా ఆత్మకూరు అభివృద్ధి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- సిద్ధం సభకు తరలి రావాలని పిలుపు



ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ''గతంలో ఈ ప్రాంతానికి ఎంతో మంది ఎమ్మెల్యేలుగా పని చేశారు. దశాబ్దాలుగా మండలంలో నీటి సమస్య ఉన్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.117 కోట్లతో శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపాం'' అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వడ్డుపల్లిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తొలుత వడ్డుపల్లి ప్రజలు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి క్రేన్ ద్వారా గజమాల వేశారు. పూలు చల్లుతూ, మహిళలు హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మ డెయిరీని ప్రారంభించి, ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఏబీఆర్ డ్యాం నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్లు వేయిస్తూ.. గ్రామాల్లో అవసరమైన చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 70 శాతం పైపులైన్ పనులు పూర్తి అయ్యాయని, ట్యాంకుల నిర్మాణాలు రెండు నెలల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. త్వరలో ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తుంగభద్ర జలాలు అందిస్తామని పేర్కొన్నారు. ఇచ్చిన మాట నెరవేర్చి మళ్లీ ప్రజల్లోకి ధైర్యంగా వస్తున్నామని తెలిపారు. అనంతరం సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ.. వడ్డుపల్లిలో లిఖిత అనే అమ్మాయికి ఉచితంగా గుండె ఆపరేషన్ చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

'సిద్ధం' సభ విజయవంతం చేద్దాం

ఈనెల 18వ తేదీన రాప్తాడులో జరిగే సిద్ధం సభకు మన పులివెందుల పులి జగనన్న వస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని సిద్ధం సభను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. జగనన్న ఏం చెయ్యబోతున్నారో ఆ రోజున చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, సర్పంచులు లక్ష్మీనారాయణరెడ్డి, ఓబులేష్, నరసింహ, ఎర్రిస్వామి, ఎంపీటీసీ ఓబులేష్, నాయకులు వాసుదేవరెడ్డి, చిన్నపరెడ్డి, అతిక్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణానాయక్, సుదీర్ రెడ్డి, అంజినప్ప, మాజీ సర్పంచులు ఓబిరెడ్డి, శివారెడ్డి, వెంకటేసులు, వన్నూరప్ప పాల్గొన్నారు.

పాల సేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న పాలవెల్లువ రూట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు

రాప్తాడు: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాల సేకరణను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని వైఎస్సార్ జగనన్న పాలవెల్లువ రూట్ ఇన్‌చార్జ్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రామినేపల్లి గ్రామంలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. పాల సేకరణపై డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా పాలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. ధర సమాచారాన్ని పాడి రైతుల మొబైల్‌కు పంపుతామన్నారు. 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లులు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. గ్రామాల్లోని పాడి మహిళా రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ ఉమాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ వేణుగోపాల్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ బదన్, అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మి తదితరులున్నారు.

హాకీ టోర్నీలో 'అనంత'కు మూడో స్థానం



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా ఉమెన్ హాకీ జట్టు

అనంతపురం: శ్రీకాకుళంలో జరిగిన 14వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్ ఉమెన్స్ హాకీ చాంపియన్‌షిప్‌లో అనంతపురం జిల్లా జట్టు మూడో స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా క్రీడాకారులను అనంతపురం హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, కోచ్ దేవకి, మేనేజర్ అఖిల అభినందించారు.

స్కేటింగ్ విద్యార్థులకు స్వాగతం

గుత్తి: తాడిపత్రి రమణ మహర్షి అనాథాశ్రమం విద్యార్థులు ఏడుగురు ఏకధాటిగా 750 కిలోమీటర్లు స్కేటింగ్ చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు స్కేటింగ్ ప్రారంభమైంది. గుత్తికి చేరుకున్న స్కేటింగ్ విద్యార్థులకు గాంధీ సర్కిల్ వద్ద స్వాగతం పలికారు. ఎంఈఓ రవి నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, కేఎస్‌కే విద్యా సంస్థల అధినేత సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.5.78 లక్షలు పలికిన టెంకాయల వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో ఏడాది పాటు టెంకాయల విక్రయానికి సోమవారం నిర్వహించిన వేలం రూ.5.78లక్షలు పలికినట్లు ఈఓ దేవదాసు, ఇన్‌స్పెక్టర్ రాణి తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏడాది పాటు ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి వేలం నిర్వహించగా ప్రొద్దుటూరుకు చెందిన సరస్వతి రూ.5.78లక్షలకు పాడి వేలం దక్కించుకుంది. అలాగే ఈ నెల 18 నుంచి 26 వరకూ జరిగే రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు టెంకాయల విక్రయానికి రూ.4.22 లక్షలకు ప్రొద్దుటూరుకు చెందిన నవీన్‌కుమార్ వేలం దక్కించుకున్నాడు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పురుషోత్తం యాదవ్, సిబ్బంది రామకృష్ణ, బాలు మోహన్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ మాసపత్రిక ఎడిటర్‌గా నరేష్ కుమార్



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అధికార మాసపత్రిక 'ఉపాధ్యాయ' ఎడిటర్‌గా బ్రహ్మసముద్రం మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కె.నరేష్ కుమార్ ఎంపికయ్యారు. 75 సంవత్సరాలుగా విద్య, ఉపాధ్యాయ, వైజ్ఞానిక, సామాజిక రంగ విషయాలపై వ్యాసాలను ప్రచురిస్తున్న 'ఉపాధ్యాయ' పత్రిక ఇటీవల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు జరుపుకుంది. ప్రతిష్టాత్మక 'ఉపాధ్యాయ' పత్రికకు ఎడిటర్‌గా నరేష్ కుమార్ ఎంపిక కావడంతో జిల్లాలోని పలువురు ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అమడగూరు: గొల్లపల్లికి చెందిన అనుష్క అనే ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. అనుష్క అక్క సుస్మితతో కలిసి అమడగూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం అక్కచెల్లెల్లు కళాశాలకు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో నుంచే అనుష్క తిరిగి ఇంటికి వచ్చేసింది. తర్వాత ఏం జరిగిందో తెలియదు. రాత్రి విషపు గుళికలు మింగి, ఇంట్లోనే ఉరి వేసుకుంది. గదిలోంచి శబ్దం రావడంతో బయట ఉన్న సుస్మిత కిటికీలోంచి చూడగా ఉరికి వేలాడుతున్న చెల్లి కనిపించింది. వెంటనే గదిలోకి వెళ్లి ఆమెను కిందకు దింపి.. 108 లో కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

'స్పందన' సమస్యలకు సత్వర పరిష్కారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శ్రీహరిబాబు

అనంతపురం కార్పొరేషన్: స్పందన ఫిర్యాదులపై అలసత్వం వహించకూడదని, సమస్యలకు సత్వర పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ శ్రీహరిబాబు సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో సోమవారం నగరపాలక సంస్థలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. సమస్యలను ఓపికగా విన్న ఆయన సకాలంలో వాటిని నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్ హెడ్స్‌ను ఆదేశించారు. స్పందనకు మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయని, అందులో రెవెన్యూ 2, ఇంజినీరింగ్ 8, టౌన్ ప్లానింగ్ 6 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేష్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఏసీపీ మారుతీహరిప్రసాద్, ఈఈ సుధారాణి, సూపరింటెండెంట్‌లు విజయ్‌కుమార్, ఖయూం, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎండోమెంట్ అధికారులు, అర్చకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాయంలో మార్చి 1 నుంచి 11 వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. సోమవారం ఆలయంలో మహాశివరాత్రికి సంబంధించిన పోస్టర్లను ఈఓ రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటస్వామి, సురేష్, తిమ్మారెడ్డి, రామ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. 8న మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ సమయంలో శివపార్వతుల కల్యాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, కిషోర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ చెక్‌పోస్టు నిర్మాణానికి స్థల పరిశీలన

ఆత్మకూరు: పంపనూరు గ్రామంలోని హైవే రోడ్డు పక్కన ఉన్న అవుట్ చెక్‌పోస్టు శిథిలావస్థకు చేరుకుంది. నూతన అవుట్ చెక్‌పోస్టు నిర్మాణానికి సోమవారం సీఐ నరేంద్రరెడ్డి, పోలీసు సిబ్బంది, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే అవుట్ చెక్‌పోస్టు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఆత్మకూరు: బీఎల్‌ఓలు బాధ్యతగా పని చేయాలి. ఎప్పటికప్పుడు సమస్యలను తెలియజేస్తూ అందుబాటులో ఉండాలని తహసీల్దార్ పరమేశ్వరస్వామి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఒక చోట ఓటు హక్కు ఉండి మరో చోట ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుంటే వారిపై సెక్షన్ 17, 18 కింద క్రిమినల్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. అంతేకాకుండా కొత్త ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించాలన్నారు. మరణించిన ఓటర్లను ఫాం–7 ద్వారా తొలగించాలని ఆదేశించారు. తప్పులు, ఒప్పులు ఉంటే ఫాం–8 ద్వారా సరి చేసుకోవాలని సూచించారు.

15న మాసుమాబీబీ ఉరుసు ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలోని మాల్దార్ వీధిలో వెలసిన మాసుమాబీ సయ్యదా సారాన్ బీబీ ఉరుసు ఈనెల 15న జరగనుంది. సోమవారం దర్గాలో ఉరుసుకు సంబంధించిన పోస్టర్లను కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఆదోనికి చెందిన సద్గురువులు హజ్రత్ సయ్యద్ లతీఫ్ అహమ్మద్ ఖాదరి స్వామి, బనగానిపల్లెకు చెందిన సద్గురువు డాక్టర్ హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షా ఖాద్రీ స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాబా, దర్గా కమిటీ ప్రతినిధులు మాబూయూనస్, మన్సూర్ ఆరీఫ్, ఇక్బాల్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.